సాక్షి
విజయనగరం
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



రక్త పరీక్ష కేంద్రాల్లో అక్రమ వసూళ్లు!

వివిధ వ్యాధుల నిర్ధారణకు రక్త పరీక్షలే ఆధారం. ఆ కేంద్రాల్లో అక్రమవసూళ్లు రోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. - 8లో



అన్ని పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లు

త్వరలో అన్ని పోలీసుస్టేషన్లకు డ్రోన్లు పంపిణీ చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. - 8లో

రైతన్నకు కష్టాలే...



చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా రైతులు ఎరువులు, విత్తనాల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకుంటుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

స్ఫూర్తిప్రదాత.. ప్రకాశం పంతులు



ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిప్రదాత అని, భవిష్యత్ తరాల వారికి ఆదర్శ ప్రాయులని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతిని కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. టంగుటూరి 1952లో ఎస్.కోట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారని, ఆయనకు మన జిల్లాతో అనుబంధం ఉండడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసరావు, సీపీఓ బాలాజీ, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ తాడ్డి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు

- ఈనెల 25 నుంచి డిపోల వద్ద పంపిణీ
- డీలర్లకు అందించిన తహసీల్దార్లు



రాజాంలో స్మార్ట్ రేషన్ కార్డులను మీడియాకు చూపిస్తున్న సీఎస్‌డీటీ చిరంజీవి

రాజాం: కూటమి ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులు తీసుకొచ్చింది. ఏటీఎం కార్డు మాదిరిగా ఉండే ఈ కార్డులను ప్రతిరేషన్ కార్డు యజమానికి అందించనుంది. ఇప్పటికే ఈ కార్డులను జిల్లాలోని అన్ని రేషన్ డిపోల డీలర్లకు అందజేశారు. ఈ నెల 25 నుంచి గ్రామాల్లో వీటిని లబ్ధిదారులకు అందించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 5.71 లక్షలకు పైగా..

జిల్లా వ్యాప్తంగా 1249 రేషన్ షాపులకు సంబంధించి 5,71,358 కొత్త రేషన్ స్మార్ట్ కార్డులను జిల్లా ప్రజా పంపిణీ వ్యవస్థ తహసీల్దార్లకు అందజేసింది. వీటిని గ్రామాల్లో అందించేందుకు పక్కా ఏర్పాట్లు చేసింది. ఈ కార్డుకు ముందుభాగంలో ఇంటి యజమాని పేరు, వివరాలు ఉంటాయి. క్యూఆర్ కోడ్ సిస్టం ఏర్పాటుచేశారు. రెండోవైపు కుటుంబ సభ్యుల వివరాలు నమోదుచేశారు. జిల్లాలో కొత్తగా 50 వేలకుపైగా రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా, వాటిని పక్కన పెట్టి పాత కార్డులు ఉంటుండగా స్మార్ట్ కార్డులు ఇవ్వడమేమిటని కొందరు విమర్శిస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వాపోతున్నారు.



వీఆర్వో సోదరుడు వర ప్రసాద్‌కు రైతు చేసిన రూ.16 వేలు ఫోన్‌పే



వీఆర్వో కుమార్‌కు ఓ రైతు చేసిన రూ.10 వేలు ఫోన్‌పే



మ్యుటేషన్ కావాలంటే.. ముట్టజెప్పాల్సిందే..!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గంధ్రేటి రమణ. ఇతనిది బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస (ఎం.కొత్తవలస) గ్రామం. తల్లి అప్పలనరసమ్మ మృతి చెందడంతో ఆమె పేరు మీద ఉన్న భూమిని తన పేరుమీద మార్చడానికి మ్యుటేషన్ పెట్టారు. దీని కోసం వీఆర్వో కడారి కుమార్‌కు రూ.15వేలు అడ్వాన్సుగా ఇచ్చారు. పనిపూర్తయిన తర్వాత ఎంత డబ్బులు ఇవ్వాలన్నది చెబుతానంటూ వీఆర్వో చెప్పారు. అయితే, ఇప్పటికీ పనిమాత్రం పూర్తిచేయలేదని ఆవేదన చెందుతున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కొవ్వాడ కృష్ణ. ఇతనిది బొండపల్లి మండలం ఎం.కొత్తవలస గ్రామం. 48 సెంట్లు భూమిని మ్యుటేషన్ చేయడానికి వీఆర్వోకు రూ.10 వేలు ఇచ్చినట్టు తెలిపారు. అయినప్పటికీ పని జరగలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు పిన్నింటి సాయిశివ. ఇతనది కూడా బొండపల్లి మండలం ఎం.కొత్తవలస గ్రామం. ఇతను అతని బావ కొవ్వాడ రామకృష్ణకు చెందిన భూమిని మ్యుటేషన్ చేసేందుకు వీఆర్వో కుమార్‌కు రూ.25,500 ఇచ్చినట్టు తెలిపారు. అయినప్పటికీ పని పూర్తిచేయలేదని వాపోతున్నారు.

ఈ నెల 21వ తేదీన వేపాడ మండలం సింగరాయి గ్రామ వీఆర్వో సత్యవతి ఓ రైతుకు సంబంధించిన భూమిని మ్యుటేషన్ పెట్టడానికి రూ.1.70 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా వీఆర్వోకు రైతు రూ.లక్ష ఇస్తుండగా ఏసీబీ అధికారులు వీఆర్వోను పట్టుకున్నవిషయం తెలిసిందే.'

- మంత్రి కొండపల్లి ఇలాకాలో రెవెన్యూ అధికారుల తీరు
- సెంటుకి రూ.300 రేటు నిర్ణయం
- ఎం.కొత్తవలస వీఆర్వో మ్యుటేషన్ కోసం రూ.లక్షల్లో వసూలు చేసినట్టు ఆరోపణలు
- రైతుల నుంచి నేరుగా ఫోన్‌పే చేయించుకున్న వైనం
- రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన రైతు సంఘం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

విజయనగరంఫోర్ట్:

రెవెన్యూ పని అంటేనే జిల్లా ప్రజలు హడలిపోతున్నారు. ఎంత ఇచ్చుకోవాలి... పని అవుతుందా?లేదా? అన్న సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. కలెక్టరేట్, మండల స్థాయిలో ప్రతి సోమవారం జరుగుతున్న పీజీఆర్‌ఎస్‌లలో అందిన వినతుల్లో రెవెన్యూకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అవినీతి ఒకటి రెండు చోట్ల కాదు.. జిల్లాలోని 27 మండలాల్లోనూ జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇలాకాలో పనిచేస్తున్న ఉద్యోగులు నేరుగా ఫోన్‌పే చెల్లింపుల ద్వారా లంచం వసూలు చేస్తున్నారంటే బరితెగింపును అర్థంచేసుకోవచ్చన్నది రైతు సంఘాల వాదన. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూలో అవినీతి ఎక్కువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేయితడపనిదే రెవెన్యూ ఫైల్స్ అంగుళం కూడా కదలడంలేదని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారుల తీరుతో రైతులు విసిగిపోతున్నారు. అధికారుల డబ్బుల దందాను నిరసిస్తూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. కొందరు ఉద్యోగులు లంచం డబ్బులను నేరుగా డిజిటల్ పేమెంట్ ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి వాటిలో చేయించుకుంటుండగా, మరికొందరు తమ కుటుంబ సభ్యుల ఖాతాలకు వేయమని సూచిస్తున్నారు.

● బొండపల్లి మండలం ఎం.కొత్తవలస వీఆర్వో కడారి కుమార్ గ్రామంలోని 35 మంది రైతుల నుంచి మ్యుటేషన్ కోసం రూ.4 లక్షలు తీసుకున్నట్టు రైతులు చెబుతున్నారు. చాలామంది రైతులు వీఆర్వోకు, అతని సోదరుడికి ఫోన్ పే, నగదు ద్వారా ఇచ్చినట్టు చెప్పారు.

సెంటుకు రూ.300 నుంచి రూ.500 రేటు

రెవెన్యూ అధికారులు భూములు రిజిస్ట్రేషన్ కోసం ఓ రేటు కూడా నిర్ణయించేశారట. సెంటుకు రూ.300 నుంచి రూ.500 వరకు రేటు పెట్టినట్టు పలువురు రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ.30 వేలు నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. మ్యుటేషన్, అడంగల్‌లో మార్పులు వంటి వాటికి రెవెన్యూ సిబ్బంది డబ్బులు ఇస్తేగాని పనిచేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పైసలు ఇస్తే ఫైల్ కదపడం, లేదంటే ఆ ఫైల్‌ను తిరస్కరించడం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

రైతన్నల ఆందోళన

మ్యుటేషన్, భూముల బదిలీలు, ఇతర భూ సమస్యల కోసం రెవెన్యూ సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడంపై రైతు సంఘం ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. రెవెన్యూ సిబ్బందికి చెల్లించిన లంచం డబ్బుల ఫోన్‌పే రసీదులను ప్రదర్శించారు. రెవెన్యూలో అవినీతి రాజ్యమేలుతోందంటూ ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి అధికారులు, ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలంటూ నినదించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, శ్రీనివాస్, అప్పలరాజు, రైతులు పాల్గొన్నారు.



ఉత్తరాంధ్ర మంత్రుల పేర్లు మిస్సింగ్

- బాబు ర్యాంకర్ల జాబితాలో కానరాని అచ్చెన్న, కొండపల్లి, సంధ్యారాణి



సాక్షి ప్రతినిధి,విజయనగరం:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు తాను ఒక కార్పొరేట్ కంపెనీ సీఈఓగా భావించుకుంటూ మంత్రులను సెకెండ్ క్యాడర్ ఉద్యోగులుగా చూస్తూ వారి పనితీరును మదింపు చేస్తూ ర్యాంకింగులు ఇవ్వడం చాన్నాళ్లుగా ఉన్న అలవాటు. ఇదే క్రమంలో ఈసారి కూడా మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు. ఇందులో భాగంగా ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అత్యద్భుత పని తీరు కనబరచిన వారు అంటూ ఐదుగురు మంత్రులతో టాప్–5 జాబితా ప్రకటించారు. అందులో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన తర్వాత ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో స్థానం, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నారు. నాలుగో స్థానంలో హోం మంత్రి అనిత, ఐదో స్థానంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చోటు దక్కించుకున్నారు. దాదాపు పాతికమంది మంత్రులు ఉన్న క్యాబినెట్లో కేవలం ఐదుగురికి మాత్రమే ర్యాంకుల కేటాయించిన సీఎం మిగతా వారిని పక్కనపెట్టినట్టుగా తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ పేరు కూడా ఈ జాబితాలో కనిపించలేదు. ఆయనను పనితీరు విషయంలో పరిగణనలోకి తీసుకోలేదో, ఆయన ర్యాంకులకు అతీతం అనుకున్నారో కానీ పవన్ మాత్రం లిస్టులో లేరు. ఇక విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి ముగ్గురు మంత్రులు ఉన్నా వారెవరూ లిస్ట్‌లో లేరు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉండగా, గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ చిన్న, కుటీర పరిశ్రమలు, ప్రవాస భారతీయుల వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు వ్యవసాయమంత్రిగా కొనసాగుతున్నారు. గత ఫిబ్రవరిలో కూడా ర్యాంకులు ప్రకటించగా అందులో కొండపల్లి శ్రీనివాస్ మూడో స్థానంలో నిలిచారు. అసెంబ్లీకి తొలిసారి ఎన్నికై, ఏకంగా మంత్రి పదవి దక్కించుకున్న కొండపల్లి కొత్తవారైనా మంచి పనితీరుతో సీనియర్లను దాటుకుని మూడో స్థానంలో నిలిచారని అప్పట్లో చెప్పుకున్నారు. అప్పట్లో అచ్చెన్నాయుడు 17, సంధ్యారాణి 18 ర్యాంకుల్లో నిలిచారు. అయితే, ఇప్పుడు కేవలం ఐదు ర్యాంకులు మాత్రమే ప్రకటించడంలో ఈ మంత్రులు ఎవరికీ పాపం అందులో స్థానం దక్కలేదు.

దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: రాష్ట్రంలో కొత్తగా వితంతువులు, వృద్ధులు, నిరుపేద వర్గాలవారికి ఒక్క పింఛన్ మంజూరు చేయకుండా, గత ప్రభుత్వం మంజూరు చేసిన దివ్యాంగుల పింఛన్ల తొలగింపుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, కోతలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఏడాది పాలనలో 4లక్షల పింఛన్లను నిలివేయగా, జిల్లాలో 80వేల పింఛన్లు తొలగించిన ఘనత కూటమిదేనన్నారు. దివ్యాంగులు దేవుడు బిడ్డలని, వారికి అండగా ఉండి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కక్షసాధిస్తోందన్నారు. దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని స్పష్టంచేశారు. యూరియా కోసం రైతులు నానా పాట్లు పడాల్సి వస్తోందన్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడమే ఎరువు కష్టాలకు ప్రధాన కారణమన్నారు.

నిరుద్యోగ భృతి ఏదీ?

ఎన్నికల ముందు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న కూటమి నాయకులు ఇప్పుడు ఏం మాట్లాడడం లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. 16 నెలల్లో ఎంత మందికి నిరుద్యోగ భృతి చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉచితమంటూ ఐదు సర్వీసులా?

మహిళల కోసం రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణం అంటూ చెప్పారని, ఇప్పుడు కేవలం 5 సర్వీసులతోనే బస్సులు నడుపుతున్నారని, దీంతో మహిళంతా అదే బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణాలు చేయాల్సి వస్తోందన్నారు. ఉచిత బస్సు ఓ బూటమన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో లక్షా 70వేల కోట్ల అప్పుచేసిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పక్కనపెట్టేసిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు సంకిలి శాంతకుమారి, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీ కృష్ణ, తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

డెంకాడ:

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రజలందరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. పినతాడివాడ గ్రామంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. సచివాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వచ్ఛాంధ్ర సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని సభికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛతే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఫాగింగ్ మిషన్ల వినియోగంపై ప్రతి పంచాయతీలో శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డీపీఓ మల్లికార్జునరావు, డీఎంహెచ్ఓ ఎస్.జీవనరాణి, ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చంనాయుడు, ఎంపీడీఓ వై.భవాని, తహసీల్దార్ రాజారావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పినతాడివాడ సచివాలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కలెక్టర్ అంబేడ్కర్

డీఎస్సీలో మరువాడ యువకుడి ప్రతిభ



గుంట ప్రసాద్

వంగర: మండలంలోని మరువాడ గ్రామానికి చెందిన గుంట ప్రసాద్ డీఎస్సీలో ఆరు పోస్టులకు ఎస్సీ కేటగిరీ–2లో అర్హత సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగాల్లో శ్రీకాకుళం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. జోన్–1లో పీజీటీ ఫిజికల్ సైన్స్‌లో ఫస్ట్ ర్యాంకు, టీజీటీ మ్యాథ్స్‌లో మూడో ర్యాంకు, టీజీటీ ఫిజిక్స్‌లో 2వ ర్యాంకు, టీజీటీ సైన్సులో నాల్గవ ర్యాంకు సాధించాడు. కుమారుడు ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు తవిటయ్య, మరియమ్మ సంతోషం వ్యక్తం చేశారు.



ఇంటిలో ఉరికి వేలాడుతున్న చిరంజీవి మృతదేహం. కింద పడి ఉన్న వెంకటలక్ష్మి మృతదేహం

ఏం కష్టమొచ్చిందో...!

- నవ దంపతులు బలవన్మరణం
- పెళ్లిచేసుకున్న ఐదునెలలకే మృత్యు ఒడిలోకి..
- మనస్పర్థలే కారణమా?
- హత్యచేశారంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- తమ్మన్నమెరక గ్రామంలో విషాదం



వెంకటలక్ష్మి, చిరంజీవి దంపతులు (ఫైల్)

కొత్తవలస: ఓ పెళ్లిలో వారి చూపులు కలిశాయి. ఇద్దరూ ఇష్టపడ్డారు. తమ ప్రేమ విషయాన్ని పెద్దలకు చెప్పారు. పెళ్లితో ఐదునెలల కిందట ఒక్కటయ్యారు. కొత్తింటిలో కాపురం పెట్టారు. వేర్వేరు ప్రదేశాల్లో పనిచేస్తూ.. ఆనందంగా జీవిస్తున్నారు. ఇంతలో ఏమైందో తెలియదు... ఒకరి తర్వాత ఒకరు ప్రాణం తీసుకున్నారు. ఈ విషాదకర ఘటనతో కొత్తవలస మండలం తమ్మన్నమెరక ఘొల్లుమంది. గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు కన్నీరు కార్చుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

కొత్తవలస మండలం తమ్మన్నమెరక గ్రామానికి చెందిన గీతల వెంకటలక్ష్మి (26), వేపాడ మండలం చిన్నదుంగాడ (కొప్పలవానిపాలెం) గ్రామానికి చెందిన కొప్పల చిరంజీవి (30)కి ఈ ఏడాది మార్చి నెలలో వివాహం జరిగింది. వెంకటలక్ష్మి తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే మృతి చెందారు. ఆమెకు దివ్యాంగుడైన తమ్ముడు రాజేష్ ఉన్నాడు. కొత్తవలస పట్టణంలోని ఓ బంగారం షాపులో పని చేస్తూ తమ్ముడిని సాకుతూ ఓ ఇంటివాడిని చేసింది. ఓ పెళ్లిలో వెంకటలక్ష్మిని చిరంజీవి చూసి ఇష్టపడడంతో పెద్దలకు తమ మనసులోని మాటను చెప్పడంతో పెళ్లిచేశారు. వెంకటలక్ష్మికి గత ప్రభుత్వ హయాంలో తమ్మన్నమెరక గ్రామంలోని జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో అందులోనే కొత్తకాపురం పెట్టారు. ఇద్దరు డిగ్రీ విద్యను అభ్యసించడంతో చిరంజీవి పెందుర్తి సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, వెంకటలక్ష్మి కొత్తవలస పట్టణంలోని ఓ బంగారం షాపులో సేల్స్ ఉమెన్‌గా పని చేస్తోంది.

ప్రాణం తీసిన మనస్పర్థలు...

అన్యోన్యంగా ఉన్న ఈ దంపతుల మధ్య ఇటీవల మనస్పర్థలు తలెత్తినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వెంకటలక్ష్మి భర్త చిరంజీవికి నీవు అనుకున్నట్లే చనిపోతున్నాను.. నీకు సంతోషమే కదా అని మెసేజ్ పెట్టింది. దీనికి వెరీగుడ్ అంటూ చిరంజీవి రిప్లై ఇచ్చాడు. సరే.. నేను షాపు నుంచి ఇంటికి ఆటోలో వెళ్లిపోతున్నాను అని మెసేజ్ చేస్తే ఒకే.. అంటూ ఆయన రిప్లై ఇచ్చాడు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన వెంటనే వెంకటలక్ష్మి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. ఆ వెంటనే ఇంటికి వెళ్లిన చిరంజీవి వెంకటలక్ష్మిని కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి అదే తాడుతో చిరంజీవి ఉరివేసుకున్నాడు. శనివారం తెల్లవారు జామున బంధువులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ షణ్ముఖరావు, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి అన్నదమ్ములు మాత్రం తమ్ముడు, మరదలను కావాలనే ఎవరో చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీమ్ బృందం ఆధారాలను సేకరించింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాలను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

క్లుప్తంగా

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ



నర్సిపురంలో స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

పార్వతీపురం రూరల్: ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సిపురం గ్రామంలో స్థానికులతో కలసి శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉండదని ఆమె తెలిపారు. బాధ్యతగా గ్రామాల్లో ఉన్న చెత్త సేకరణ సిబ్బందికి స్పందిస్తూ నిబంధనల మేరకు తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా అందించి ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా చెత్త సేకరణ సిబ్బందికి అప్పగించాలన్నారు. పార్వతీపురం తహసీల్దార్ సురేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల తస్మాత్.. : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి

సీతానగరం: సైబర్ నేరాలకు పాల్పడవద్దని, మాదక ద్రవ్యాల బారిన పడి యువకులు తప్పుదోవ పట్టొద్దని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ క్రీడా మైదానంలో సంకల్పం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, మాదక ద్రవ్యాల నిరోధం అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నిజం చేసే విధంగా విద్యావంతులు కావాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు ఎస్పీ అంకిత సురానా, డీవీఈవో నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజారావు, ఎంఈవోలు సూరిదేముడు, వెంకటరమణ, సీఐ గోవిందరావు, ఎస్ఐ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వంశధారలో వివాహిత గల్లంతు



గల్లంతైన వివాహిత కుమ్మరి లక్ష్మి(ఫైల్)

భామిని: మండలంలోని లివిరి గ్రామానికి చెందిన వివాహిత కుమ్మరి లక్ష్మి(38) గ్రామ సమీపాన ఉన్న వంశధార నదిలో శనివారం స్నానానికి దిగి గల్లంతైంది. దీన్ని గుర్తించిన నదిలోని తోటి మహిళలు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ శివన్నారాయణ, ఎంఆర్ఐ మణి ప్రభాకర్, బత్తిలి ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి తెప్పల సాయంతో నదిలో గాలించారు. అయినా లక్ష్మి జాడ కనిపించలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నదీ తీరాన ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్‌లు

విజయనగరం టౌన్: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సరికొత్త ట్రిపుల్ పే ప్లాన్‌ను ప్రకటించిందని ఆ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ. 400 చెల్లించడం ద్వారా హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తో పాటూ 400పైగా టీవీ చానెల్స్, తొమ్మిది ఓటీటీ చానెల్స్, అపరిమిత ఫోన్‌కాల్స్ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీహెచ్ వాడుతున్న వినియోగదారులు కూడా రూ.140 చెల్లించి టీవీ, ఓటీటీ చానల్స్ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్త పరీక్ష కేంద్రాల్లో అక్రమ వసూళ్లు!

- జిల్లాలో 47 రక్త పరీక్ష కేంద్రాలు
- మలేరియా, టైఫాయిడ్, డెంగీ స్పెషల్ ప్యాకేజీలంటూ వసూళ్లు
- ప్యాకేజీ కింద రూ.2 వేల నుంచి 2500 వరకు వసూళ్లు

జిల్లాలో ల్యాబ్‌ల వివరాలు	
ప్రైవేటు ల్యాబ్‌లు :	14
ప్రైవేటు ఆసుపత్రుల్లో ల్యాబ్‌లు :	34
పాలీక్లినిక్‌లలో ల్యాబ్‌లు :	35



పట్టణంలో ప్రైవేట్ ల్యాబ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు (ఫైల్)

పార్వతీపురం టౌన్: పల్లె, పట్టణం అన్న తేడా లేదు.. మంచం పట్టని గ్రామం అంతకన్నా లేదు.. వీధివీధినా.. ఇంటింటిలో జ్వరంతో ప్రజలు అల్లాడుతున్నారు. జ్వర బాధితులను కాళ్లు వాపులు, ఒళ్లు నొప్పులు వేధిస్తున్నాయి. వచ్చింది ఏ జ్వరమో తెలుసుకునేందుకు రక్త పరీక్ష కేంద్రాలకు వెళ్తే మలేరియా, టైఫాయిడ్, డెంగీ ప్యాకేజీ అంటూ రూ.2వేల నుంచి రూ.2500 వరకూ కేంద్రాల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు.

నెల రోజులుగా..

నెల రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు ఒక్కొక్క పరీక్షకు ఒక్కో రేటు అన్న చందంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఏ పరీక్షకు ఎంత ధర అన్న వివరాలు తెలిపే బోర్డులు ఏవీ ఏర్పాటు చేయడం లేదు. జ్వర పీడితులు అధికంగా ఉండటంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలకు ప్రత్యేక ప్యాకేజీ అంటూ వేల రూపాయిలు వసూలు చేస్తున్నారు. జ్వర పీడితులను తమ వద్దకు పంపించిన ప్రైవేటు వైద్యులు, ఆర్‌ఎంపీలకు రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు కమీషన్లు ముట్టజెబుతున్నారు. సీజనల్ వ్యాధుల ముసుగులో రక్త పరీక్ష కేంద్రాల వారు బాగా దండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌సీల్లో అంతంతమాత్రంగానే...

జిల్లాలోని 37 పీహెచ్‌సీలతో పాటు ఐదు పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. గతంలో ఆసుపత్రుల్లో నిత్యం ఓపీకి 20 నుంచి 30 వరకు వచ్చేవారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది పెరగడమే కాకుండా, అవసరమైన మందులు, రక్త పరీక్షలకు యంత్ర పరికరాలు సమకూరాయి. వైద్య సేవలు మెరుగు కావడంతో రోజుకు వంద మంది ఓపీ సేవలు అందించేవారు. రక్త పరీక్షల సామగ్రి పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో గతంలో పరీక్షలు వేగవంతంగా చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పీహెచ్‌సీల అభివృద్ధి గాలికి వదిలేయడంతో పీహెచ్‌సీల్లో సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయన్న విమర్శలున్నాయి.

డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరి

రక్త పరీక్ష కేంద్రాల్లో ధరలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలి. అధిక ధరలు వసూలు చేస్తున్న ల్యాబ్‌లను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ల్యాబ్‌లలో మాత్రమే రక్త పరీక్షలు చేయించుకోవడం మంచిది. అన్ని పీహెచ్‌సీలలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజలు గమనించాలి.

– డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి

చర్యలు తీసుకుంటాం..



రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అధిక ధరలు వసూలు చేస్తున్న వారి వివరాలు తెలిపితే అక్కడకు వెళ్లి విచారణ చేస్తాం. ల్యాబ్‌ల్లో తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. ఎక్కడ అధికంగా వసూలు చేసినా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ భాస్కరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో, పార్వతీపురం

బ్యాడ్మింటన్ పోటీల విజేతగా విజయనగరం



విజయనగరం సర్కిల్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న డైరెక్టర్ చంద్రం తదితరులు

అరసవల్లి: జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. తుది ఫలితాల్లో ఓవరాల్ చాంప్‌గా విజయనగరం సర్కిల్ ఈపీడీసీఎల్ జట్టు నిలిచింది. రెండో స్థానంలో నెల్లూరు ఎస్పీడీసీఎల్, మూడో స్థానంలో జెన్‌కో ఆర్టీపీఎస్ కృష్ణపట్నం నిలిచాయి. శనివారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టి.వనజ, చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్ఎ) ఎల్.మహేంద్రనాథ్, సీజీఎం (మెటీరియల్స్) పి.శ్రీదేవి, జనరల్ మేనేజర్ కె.సురేఖ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ వడివేలు, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ, డివిజనల్ ఈఈ పైడి యోగేశ్వరరావు, సెక్రటరీ మహంతి ప్రభాకరరావు, సనపల వెంకటరావు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, ఎస్ఏఓ ఎ.శ్రీనివాసరావు, డీ-1 ఏఈ జె.సురేష్‌కుమార్, డీ-2 ఏఈ కింజరాపు జయరాం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించడంలో విజయనగరం టాప్



నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కలెక్టర్ అంబేడ్కర్, జిల్లా జడ్జి బబిత, ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, తదితరులు

- డీఐజీ గోపీనాథ్ జెట్టీ

విజయనగరం క్రైమ్: మహిళలపై దాడులు చేపడుతున్న వారితో పాటు పోక్సో కేసుల్లోని నిందితులను శిక్షించడంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని డీఐజీ గోపీనాథ్ జెట్టీ అన్నారు. శనివారం స్థానిక డీపీఓ అర్ధ సంవత్సరపు నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా జడ్జి బబిత హాజరైన ఈ సమీక్షలో డీఐజీ మాట్లాడుతూ..ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఎక్కువగా విద్యార్థులు అరెస్ట్ అవుతున్నారన్నారు. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి, డీ అడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందించాలని సూచించారు. నేరాల నియంత్రణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమాజానికి కీడు కలిగించే ప్రతీ అంశం తెలుసుకోవాల్సిన బాధ్యత పోలీస్ సిబ్బందిపై ఉందన్నారు. సైబర్ కేసులను దర్యాప్తు చేసేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని పోలీస్ అధికారులు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అనుమతుల్లేకుండా కలిగి ఉన్న ఆయుధాలను స్వాధీన పరుచుకునేందుకు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు.

పరిహారం మంజూరయ్యేలా చర్యలు..

కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం తక్షణమే మంజూరయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. జాతీయ రహదారిపై 66 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్ అందిస్తామన్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ.. గంజాయి నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ పది ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపడుతుండడంతో పాటు ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అడ్డుకుంటున్నామని తెలిపారు. 25 పోక్సో కేసుల్లోను, మరో 18 కేసుల్లో నిందితులు శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం శక్తి యాప్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆవిష్కరించారు. షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించిన అగ్గిరాజు, రూప, హారికలను అధికారులు అభినందించారు. అదేవిధంగా గంజాయి కేసుల్లో ఇన్వెస్టిగేషన్‌ను సమర్థవంతంగా పూర్తి చేసిన ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావులకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి.మణికుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ బి.శ్రీనాథుడు, డీఎఫ్ఓ ఆర్. కొండలరావు, డీఎంహెచ్ఓ జీవన్రాణి, డీఈఓ కేవీ రమణ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు, డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, జి. భవ్యారెడ్డి, డీఎస్పీ ఎస్.రాఘవులు, డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీఎస్పీ ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, జైళ్ల శాఖ, ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డ్రగ్స్ అండ్ కంట్రోల్ శాఖాధికారులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలి..

న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ వేగవంతంగా పూర్తయ్యేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని జిల్లా జడ్జి బబిత కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కోరారు. ఎన్డీపీఎస్ కేసుల్లో ఇన్వెంటరీ, సీజర్ చేయడంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సెప్టెంబర్ 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పోలీస్ అధికారులను కోరారు.

త్వరలో అన్ని పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లు



వార్షిక తనిఖీల్లో భాగంగా టూ టౌన్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్‌ను కేసుల పనితీరుపై తెలుసుకుంటున్న డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : త్వరలో అన్ని పోలీసుస్టేషన్లకు డ్రోన్లు పంపిణీ చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను విరివిగా ఉపయోగించాలని అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం టూటౌన్ పోలీసుస్టేషన్‌ను శనివారం సందర్శించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. స్టేషన్లోని సీసీ టీవీ కమాండ్ కంట్రోల్ రూమును సందర్శించి వాటి పని తీరును చూశారు. స్టేషన్లో పని చేస్తున్న కోర్ట్ కానిస్టేబుళ్లతో మాట్లాడి శిక్షలు పడటానికి అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పర్చాలని, సమన్లు సకాలంలో సర్వ్ చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్లోని రిసెప్షన్, గదులను పరిశీలించి, రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేసి, పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి అదుపు చేయాలన్నారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంరక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకం అని, వారు శక్తి యాప్ గురించి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి సమాచారిన్ని సేకరించి సంబంధిత అధికారులకు చేరవేయాలని ఎం.ఎస్.పి.లను డీఐజీ ఆదేశించారు. అనంతరం సీఐ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఇక ఎంఎస్పీలను బందోబస్తుకు ఉపయోగించబోమని, కేవలం స్టేషన్ వారీగా సమాచారం కొరకు వారి సేవలను వినియోగిస్తున్నామన్నారు. అనంతరం డీఐజీ జెట్టి, ఎస్పీ వకుల్ జిందల్ పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. వార్షిక తనిఖీల్లో డీఐజీతో పాటు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ ఎ.వి. లీలారావు, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు,ఎస్ఐలు కృష్ణమూర్తి, కనకరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ ఆత్మహత్య



మృతి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ నరసింహరావు

విజయనగరం క్రైమ్: పురుగుల మందు తాగి ఆర్‌ఎంపీ వైద్యుడు నరసింహరావు(48) ఆత్మహత్య చేసుకున్నట్టు వన్ టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి ఏఎస్ఐ జగన్మోహనరావు తెలిపిన వివరాలు.. భోగాపురంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్న నరసింహరావు రెండు రోజుల కిందట భార్య జ్యోతికి విజయనగరంలో పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. నరసింహరావు నగరంలోని సంగీత కళాశాల వద్ద ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద పడి ఉండడాన్ని శనివారం గుర్తించిన స్థానికులు ఫోన్ నంబరు ఆధారంగా భార్యకు సమాచారం అందించారు. వెంటనే భోగాపురం నుంచి వచ్చిన జ్యోతి అపస్మారక స్థితిలో ఉన్న భర్తను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్పించింది. కాగా, శనివారం మృతి చెందినట్టు ఆసుపత్రి వర్గాలు వన్ టౌన్ పోలీసులకు తెలియజేయడంతో కేసు నమోదు చేశారు.

కూటమి పాలనలో రైతన్నకు కష్టాలే...

- ఇచ్చిన హామీలు అమలెప్పుడు?
- ఆడబిడ్డ నిధికి సమాధి
- నిరుద్యోగ భృతి ఎక్కడ?
- గ్యాస్ సబ్సిడీ నిల్
- మంత్రి ఇలాకాలో రహదారులు అధ్వానం
- కూటమి సర్కారు వైఫల్యాలపై పీడిక రాజన్నదొర ధ్వజం



కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

విజయనగరం గంటస్తంభం: చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా రైతులు ఎరువులు, విత్తనాల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకుంటుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర అన్నారు. విజయనగరం ప్రదీప్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఇంటి వద్ద విలేకరులతో శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల వద్ద స్టాక్ ఉంచి రైతులకు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతును వంచించడం సబబు కాదన్నారు. విజయనగరం, సాలూరు నియోజవర్గంలో సుమారుగా 2,500 మంది పింఛన్‌దారులకు నోటీసు అందజేయడం విచారకరమన్నారు. నోటీసులు ఇచ్చామే తప్ప పింఛన్లు తొలగించమంటూ జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీలను త్రికరణ శుద్ధితో అమలుచేయడంలో సీఎం చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 58,58,000 మందికి రైతు భరోసా అందజేస్తే.. నేడు సుమారు 78 లక్షల మంది రైతులు ఉండగా 50 లక్షల మందికే అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి కలిగిందన్నారు. తల్లికి వందనం పథకంలోనూ కోత పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా నిరుద్యోగభృతి ఊసే లేదన్నారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ఉత్త గ్యాస్‌గా మారిందని విమర్శించారు. ఆడబిడ్డ నిధికి సమాధి కట్టేశారని విమర్శించారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు మహిళందరికీ ఆడబిడ్డ నిధి కింద ప్రతీనెలా రూ.1500 అందజేస్తామని చెప్పి ఉసూరుమనిపించారన్నారు.

అబద్ధాల పాలన

గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి మాటల్లో నూరుకి తొంభై అబద్ధాలే ఉంటాయని రాజన్నదొర విమర్శించారు. సాలూరు నియోజకవర్గంలోని గిరిశిఖర గ్రామాలకు చంద్రబాబు హయాంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. మక్కువ నుంచి మంత్రి స్వగ్రామం కవిరిపల్లికి, కవిరిపల్లి నుంచి శంబరకు, శంబర నుంచి మామిడిపల్లికి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారినా మంత్రి స్పందించకపోవడం విచారకరమన్నారు. మక్కువ నుంచి భోగవలస మెయిన్ రోడ్డును రూ.56 కోట్లతో కొంతమేర పనులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. మంత్రికి బురద జల్లడం తప్ప పనులు చేయడం చేతకావడంలేదని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో ఆల్తిపాలెం జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అతి వేగంతో వెళుతున్న రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. అదే సమయంలో వస్తున్న మరో బైక్‌ను కూడా ఢీ కొట్టడంతో మూడు ద్విచక్ర వాహనాలు చెల్లా చెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో సతివాడ, రాగోలు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహకారంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

'ఉపాధి' అవకతవకలపై విచారణ వాయిదా



వాదులాడుకుంటున్న ఇరువర్గాలు

లక్కవరపుకోట: మండలంలోని కోనమసివానిపాలెం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని గ్రామానికి చెందిన కాకర శ్రీనివాసరావు గత నెలలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధిహామీ పథకం అధికారులు విచారణ చేపట్టడానికి శనివారం గ్రామానికి రాగా.. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడు బండ అప్పారావు (అప్పన్న) మరో 39 మంది వ్యక్తులతో కలిసి ఉపాధి నిధులను దుర్వినియోగం చేసినట్లు కాకర శ్రీనివాసరావు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. 2011 సంవత్సరం నుంచి 2019 వరకు జరిగిన అవకతవకలపై సోషల్ ఆడిట్ బృందాలు సైతం సక్రమంగా ఆడిట్ నిర్వహించలేదని.. అలాగే 2024 వరకు పనికి వెళ్లని వారి పేరిట దొంగ మస్టర్లు వేసి నిధులు దోచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో గజపతినగరం ఏపీడీ కె.రామామణి ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో గల పంచాయతీ కార్యాలయం వద్దకు శనివారం చేరుకుని విచారణకు సిద్ధపడగా గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. పనులకు సంబంధించి ఎటువంటి అవకతవకలు జరగలేదని ఒక వర్గం.. జరిగాయని మరోవర్గం ఆరోపిస్తూ వాదనకు దిగారు. దీంతో ఓ దశలో తోపులాట జరగడంతో అధికారులు భయంతో సమీపంలో గల రామాలయంలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించారు. అయితే పరిస్థితి అనుకూలంగా లేదని పోలీసులు చెప్పడంతో విచారణను వాయిదా వేస్తున్నట్లు ఏపీడీ రమామణి ప్రకటించి, వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీబీటీ మేనేజర్ ఆసిఫ్ హుసేన్, స్థానిక ఎపీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹125	₹220	₹230